# Sahityamu - Neethi (సాహిత్యము – నీతి)

**Dr. G. Jhansi Vani**
HOD,
Department of Telugu
Bapatla Arts & Science College,
Bapatla,Guntur District - 522101

నైతిక విలువలతో కూడిన మానవ మనుగడకు, అభ్యున్నతికి 'సాహిత్యమే' పరమ సోపానం. "సహితస్యభావం సాహిత్యం" – హితంతో కూడినది, హితాన్ని కలిగించేదే సాహిత్యం. ఈ అనంత సృష్టిలో ఆది నుండి నీతిని వెలయించే సాహిత్యమే అవతరించింది. ప్రభు సమ్మితాలైన వేదాలు, మిత్ర సమ్మితాలైన పురాణాలు, కాంతా సమ్మితాలైన కావ్యాలు అనాదిగా నీతి, ధర్మ విషయాలనే పరమావధిగా ప్రభోదిస్తూ వచ్చాయి.

ప్రపంచంలోని ఏ సాహిత్యమైనా పదికాలాలపాటు నిలబడగలగాలంటే అందులో సందేశాత్మకమైన నీతి మిళితమై ఉండాలి. మన భారతీయ సాహిత్యంలో ఆది కావ్యం రామాయణం నుండి నేటి వరకు నైతిక విలువలతో కూడిన రచనలు మాత్రమే శాశ్వతత్వాన్ని పొందాయి.

"విశ్వశ్రేయ: కావ్యం" అనే ఉవాచ మనందరికి తెలిసిందే. విశ్వానికి (ప్రజలకు) శ్రేయస్సు ఎప్పుడు కలుగుతుంది? సాహితంలో నైతిక విలువలున్నప్పుడే కదా! పంచతంత్ర కథలు, హితోపదేశం, శుకసప్తతి, గాథా సప్తశతి, కథా సరిత్సాగరం మొదలైన కథల్లో నీతి అడుగడుగునా ప్రబలంగా కనిపిస్తుంది.

వాల్మీకి, వ్యాసుడు, బాణుడు, భాసుడు, కాళిదాసు, భవభూతి, భర్తృహరి, విష్ణుశర్మ, నారాయణ పండితుడు మొదలైన సంస్కృత కవులతో పాటు కవిత్రయం, పోతన, శ్రీనాథ, సోమన, పెద్దనాది ప్రబంధ కవులు, బద్దెన, వేమన, ఏనుగు లక్ష్మణకవి, మారద వెంకయ్య లాంటి శతక కవులు, అన్నమయ్య,త్యాగయ్య, క్షేత్రయ్య లాంటి వాగ్గేయకారులు, కందుకూరి, గురజాడ, రాయప్రోలు,జాషువా, శ్రీశ్రీ, గుంటూరు శేషేంద్ర శర్మ, బోయి భీమన్న వంటి ఆధునిక కవులు తమ రచనలలో నీతి సౌరభాలను వ్యాపింపచేసారు.

"రచన సుందరమై, సార్వజనీన ప్రయోజనం కలిగి భావాత్మకమైన ఆహ్లాదాన్ని ఇచ్చుచు, కర్తయొక్క ఆత్మీయతను స్ఫురింప చేయు గ్రంధము కావ్యము. ఆ కావ్య జాలమే సాహిత్యం. ఆ సాహిత్యమే ఒక కళ" (సాహిత్య శిల్ప సమీక్ష – పింగళి లక్ష్మీకాంతం) అని పింగళి వారు కళను నిర్వచించారు. కళలన్నింటిలో సాహిత్యకళ గొప్పది.

ఆ సాహిత్యం కూడా అనేక రూపాలలో, వివిధ ప్రక్రియలలో అలరారు తున్నది. పద్యం, గద్యం, గేయం, కవిత, వచన కవిత, మినీకవిత, భావ కవిత, అభ్యుదయ గేయం, జానపద గేయం, నాటకం, నవల, కథ, కథానిక మొదలైన రూపాలలో పెక్కు సోయగాలతో ఇంపు గొలుపుతూ వచ్చింది. పైన చెప్పిన వాటిలో ఎక్కువ భాగం ఆహ్లాదకరమైన రచనలున్నప్పటికి ఏదో ఒక సందేశం, నీతి అంతర్లీనంగా ఉంటూనే ఉంది.

"సంసారమనే విష వృక్షానికి అమృతోపమానములైన ఫలములు రెండు కలవు. ఒకటి సజ్జన సాంగత్యం, రెండు సద్గ్రంధ పఠనం" – అని పంచతంత్రంలో చెప్పబడింది. అలాంటి సద్గ్రంధాలలో రామాయణ మహాభారతాలు ముందుంటాయి. సమస్త జీవకోటికి నీతి ఎలా ఉండాలో రామాయణం విశదం చేస్తుంది. మహాభారతంలో లేని అంశం ప్రపంచంలోలేదు. ప్రపంచంలో లేనిది మహాభారతం లో లేదు. అన్ని అంశాలను అన్ని విషయాలను, అన్ని కోణాలలో భారతం స్పృశించింది.

తెలుగు సాహిత్యంలో సార్వకాలికము, సార్వజనీనమైన నీతులు ఎన్నో ఉన్నాయి. అవి సందర్భానుసారంగా ఆయా కావ్యాల్లో ఆయా కవులు వాటిని పొందు పరుస్తూ అమేయమైన, అమోఘమైన సందేశాలను అందిస్తూ సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. వారిలో ఆద్యుడు, ఆదికవి నన్నయ్య భారత రచన పరిశీలిస్తే నీతుల పరంపర వెల్లువెత్తుతుంటాయి. స్థాలీపులాక న్యాయం చేత అందులో మచ్చుతునకగా 'సత్యవాక్య – పాలన' అనే ఒక అంశాన్ని పరిశీలించడం జరిగింది.

ఆంధ్ర మహాభారతంలో నన్నయ్య రచించిన ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని శకుంతలోపాఖ్యానంలో శకుంతల చేత నన్నయ చెప్పించిన 'సత్యవాక్పరిపాలన' మనే నీతి ప్రతి మానవునికి ఉండాల్సిన ప్రధమమైన, ప్రధానమైన లక్షణం.

శకుంతల తన బిడ్డను తీసుకొని తనను గాంధర్వ వివాహమాడిన దుష్యంతుని దగ్గరకు వెళ్ళినపుడు దుష్యంతుడు ఆమె ఎవరో తెలియనట్లు ప్రవర్తిస్తాడు. ఆ సందర్భంలో నిండు సభలో తనకు కలిగిన అవమానాన్ని, ఆవేదనను దిగమింగుతూ నిబ్బరంగా, నిర్భయంగా, శాంతంగా, గంభీరంగా దుష్యంతుడికి కనువిప్పు కలిగేటట్లు సత్యవాక్యం యొక్క గొప్పతనాన్ని చాటి చెబుతూ ……

"నుతజలపూరితంబులగు నూతులు నూతిటికంటే సూనృత
వ్రత మొక బావి మేలు మఱి బావులు నూరిటికంటే నొక్కస
త్క్రతు వదిమేలు తత్క్రతుశతంబునకంటే సుతుండు మేలు త
త్సుత శతకంబు కంటే నొక సూనృత వాక్యము మేలు చూడగన్"

ఈ పద్యంలో ఎంతో గొప్ప తత్వం ఇమిడి ఉంది నూతులను ఎవరిఇంటిలోవారు తమ స్వప్రయోజనం కోసం త్రవ్వుకునేది. అది ఆ యింటి జనులకే పరిమితం కాని దిగుడుబావి అలాకాదు. అది చాలా లోతైనది, విశాలమైనది కొన్ని వందల మందికి ఉపయోగపడేది. అందుకే నూతి కన్నా భావి మేలన్నాడు. అలాంటి బావులు వందకంటే ఒక యజ్ఞం ఎందుకు మేలైనదంటే యజ్ఞగుండంలో ఎండిన పలు ఔషద మొక్కల కాండాలను,

వేళ్ళను, రాగి, వెండి, బంగారం వంటి లోహాలను ఎంతో ఆరోగ్యప్రదమైన ఆవు నెయ్యిని వేయడం జరుగుతుంది. ఇవన్నీ అగ్నిలో కాలి వాయువుగా వెలువడుతుంది. ఈ వాయువుకి వ్యాధినిరోధక శక్తి (అంటీబయోటిక్) ఉండడం చేత అవి అంటువ్యాధుల నిరోధకారిగా ఉపయోగ పడుతుంది. పూర్వం కలరా, మశూచి వంటి ప్రమాదకర అంటువ్యాధులు సోకి ఊరు ఊరంతా స్మశానాలుగా మారిపోతుండేది. అలాంటి సమయాల్లో ఈ యజ్ఞాలు వేలాది మంది ప్రజలను కాపాడే కల్పతరువుగా పరిఢవిల్లేది. అంతే కాకుండా ధర్మ చింతన కూడా పెరిగే అవకాశముంది. అందుకే వంద బావులకంటే ఒక యజ్ఞం మేలన్నాడు. యజ్ఞం అంటే మాట కాదు దాన్ని బాధ్యతతో నిర్వహించడానికి సమర్ధుడైన వాడు కావాలి. సత్సంకల్పం ఉంటే మాత్రం చాలదు. ఆ సంకల్పాన్ని కార్యరూపంలో పెట్టే ఒక సమర్ధుడైన కుమారుడు కావాలి (ఆ నాడు పురుషాధిక్య సమాజం కాబట్టి పుత్రుడన్నారు అదే ఈ నాడైతే పుత్రికలు కూడా చేయగలుగుతారు) అందుకే వంద యజ్ఞాల కంటే ఒక కుమారుడు మేలన్నారు. ఎంతమంది సంతాన (కుమారులు) మున్నా వారు సత్య శీలురు, సమర్ధులు కాని పక్షంలో సుఖం ఉండదు. అందుకే వంద మంది కుమారుల కన్నా ఒక సత్యవాక్యం మేలన్నారు. సత్యవాక్యం యొక్క గొప్పతనాన్ని ఇంతకన్నా అందంగా, ఉత్తమోత్తమంగా సాహిత్య సహాయం చేకుండా ఎవరైనా చెప్పగలరా? చెప్పి మెప్పించగలరా?

అంతే గాకుండా

" వెలయంగ నశ్వమేధం
బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం
దుల నిడి తూ(పగ సత్యము
వలనన్ ములు సూపు గౌరవంబున పేర్మిన్"

– (శకుంతలోపాఖ్యానం– 95 పద్యం)

వేయి అశ్వమేధయాగాల ఫలితాన్ని మరియు ఒక సత్యవాక్యం యొక్క ఫలితాన్ని త్రాసునకు రెండు వైపులా ఉంచి తూచినప్పుడు సత్యం యొక్క గొప్పతనం చేత ఆ త్రాసు యొక్క ముల్లు సత్యంవైపే మొగ్గుతుందని తెలియజేసాడు. అసత్యపు జీవితాన్ని జీవిస్తూ ఎన్ని గొప్ప పనులు చేసినా అది వ్యర్ధం. సత్య పథమే మిన్న అన్న గొప్ప జీవిత సత్యాన్ని ఇది వెల్లడిస్తుంది. స్వార్ధపూరితంగా ప్రచార అర్భాటాలకోసం, పదవులకోసం దాన ధర్మాలు చేస్తూ పేద ప్రజలపై మమకారంతో, వారి అభ్యున్నతి కోసం ఇదంతా చేస్తున్నట్లు అసత్యాలు, ప్రగల్భాలు పలుకుతున్న వారికి ఈ మాటలు కనువిప్పు.

మరియు అంతటితో ఆగకుండా

"సర్వ తీర్ధాభిగమనంబు సర్వదేవ
సమధిగమము సత్యంబుతో సరియు( గావ
యెఱు( గు మెల్ల ధర్మంబులకెందు( బెద్ద

యం(డు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు"

–శకుంతలోపాఖ్యానం – 96వ పద్యం

అంటూ మరో గొప్ప సత్యాన్ని వెల్లడించారు నన్నయ. పుణ్యతీర్థాలను సందర్శించడం, వేదాలు చదవడం సత్యంతో సమానమైనవి కావంటాడు. ఎంతో మంది (ప్రజలు అనేక పాపకార్యాలు చేస్తూ పుణ్య నదీస్నానాలు ఆచరించి, పుణ్యక్షేత్రాలు దర్శించి తామెంతో పుణ్యాత్ములైపోయామని (భ్రమలో ఉంటారు. అలాగే ఇంకొందరు (ప్రతి నిత్యం మత (గ్రంధాల పారాయణం చేస్తుంటారు. కానీ ఆచరణలో మా(త్రం శూన్యం. కేవలం వాటిని పఠించినంత మా(త్రానే ఎవరూ పునీతులైపోరు. ఈ సత్యాన్నే కుండబద్దలు కొట్టినట్లు శకుంతల పా(త్ర ద్వారా నన్నయ (ప్రకటించారు. సత్యవాక్పరిపాలన, దాంపత్యధర్మంలను శకుంతలోపాఖ్యానంలో నన్నయ విరచించిన తీరు అతడి "నానా రుచిరార్థ సూక్తినిధి" అనే కవితా లక్షణాన్ని సార్ధకం చేస్తూ పాఠకుల జన్మను తరింప జేస్తుంది.

"ఎఱిగిన దానిని మఱవకనుష్ఠించునది సమంజస బుద్ధిన్" (ఆది పర్వం 3వ ఆ॥ – 203వ పద్యం) అని యయాతి పూరుడికి చేసే నీతి బోధలో 'తెలిసిన ధర్మాన్ని మరువకుండా సద్బుద్ధితో ఆచరించాలని' ఉద్బోధిస్తారు. కావున నీతులు తెలుసుకోవడమే కాదు వాటిని ఆచరణలో పెట్టడమే ముఖ్యం. లేకపోతే అజ్ఞానం (ప్రయోజన రహితమవుతుంది. ఈ దిశగా నేటి యువతను ముందుకు నడపాల్సిన బాధ్యత సాహిత్య బోధకుల భుజస్కంధాలపై ఉన్నదన్న విషయం మరువకూడదు.

ఈ (ప్రపంచంలో 'నీతి' అనే పరిమళాన్ని వెదజల్లే సాహిత్యమేదైనా అజరామరమై, ఆచం(దార్కమై విరాజిల్లుతూనే ఉంటుంది.

ఉపయుక్త (గ్రంథ సూచిక :–

1. సాహిత్య శిల్ప సమీక్ష – పింగళి లక్ష్మీ కాంతం
పంచమ ము(ద్రణ – 1983
గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ.

2. తెలుగు సాహిత్య చరి(త – ఆరు(ద
(ప్రధమ సంపుటము

3. ఆం(ధ మహా భారతము – ఆది సభా పర్వాలు
వావిళ్ళ రామస్వామి & సన్స్, మ(దాస్